సాకారమైన వెంకన్న ఆలయ అభివృద్ధి

- దాతల సహకారంతో మారిన ఆలయ రూపురేఖలు
- 21 నెలల కాలంలోనే రూ.1.50 కోట్లతో శరవేగంగా అభివృద్ధి పనులు
- కోనేరు, బేడా మంటపం అభివృద్ధి, ప్రసాద పంపిణీ శాల నిర్మాణం


అమలాపురం వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం


ఆలయ ప్రాంగణంలో భక్తులకు ఆహ్లాదాన్ని పంచుతున్న కోనేరు

అమలాపురం టౌన్‌: కోనసీమ పెళ్లిళ్ల వెంకన్నగా పేరుగాంచిన అమలాపురం వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని రూ.1.50 కోట్లతో అభివృద్ధి చేశారు. దాతల సహకారంతో ఆలయంలో అనేక సౌకర్యాలు కల్పించడంతో పాటు ఆలయ ప్రాంగణంలో ఓ ఆధ్యాత్మిక, ఆహ్లాదకర వాతావరణం ఆవిష్కృతమైంది. ఫలితంగా ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య సైతం గణనీయంగా పెరిగింది. ప్రధానంగా ఏళ్లుగా నిర్లక్ష్యానికి గురైన ఆలయ ప్రాంగణంలోని కోనేరును అభివృద్ధి చేసి చుట్టూ ఉద్యానవనం ఏర్పాటుపై భక్తులందరి నుంచి ప్రశంసలు దక్కాయి. అలాగే బేడా మంటపం, ప్రసాద పంపిణీ శాల నిర్మాణం, అన్నదాన షెడ్డు నిర్మాణం, పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహ ఏర్పాటు సైతం అందరినీ ఆకట్టుకున్నాయి.

ఆలయ అభివృద్ధికి పడిన అడుగులు

రూ.16 లక్షలతో ఆలయ బేడా మంటపం, స్వామి వారి కల్యాణం నిర్వహించే మంటపాన్ని అభివృద్ధి చేశారు. యెండూరి నాగేశ్వరరావు కుటుంబీకుల వితరణ రూ.16 లక్షలతో ఆలయంలో ప్రసాద తయారీ, పంపిణీ శాల నిర్మించారు. ప్రధానంగా ఏళ్లుగా నిర్లక్ష్యానికి గురైన ఆలయ ప్రాంగణంలోని కోనేరును రూ.25 లక్షలతో అభివృద్ధి చేశారు. అంతేకాకుండా రూ.6 లక్షలతో కోనేరు చుట్టూ ఉద్యానవనం ఏర్పాటుచేవారు. దీనివల్ల ఆలయ ప్రాంగణంలోని భక్తులకు కోనేరు ఆహ్లాదాన్ని పంచుతుంది. మరో రూ.6 లక్షలతో ఆలయానికి రంగులు వేశారు. రూ.4 లక్షలతో ఆలయ ప్రాంగణంలో 18 అడుగుల ఎత్తుతో నిర్మించిన పంచముఖ ఆంజనేయ స్వామి భారీ విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రూ.9 లక్షలతో ఆలయానికి జనరేటర్ సమకూర్చారు. రూ.20 లక్షలతో ఆలయ ప్రాంగణంలో అర్చకుల వసతి గృహాలు(నిర్మాణ దశలో), అన్నదాన షెడ్డు నిర్మించారు. స్వామి వారి రథం షెడ్డు వద్ద రూ.1.50 లక్షల సీసీ నిర్మాణం చేశారు. ఆలయమంతా దేదీప్యమానమైన విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తులు క్యూలో నిలుచునేందుకు రూ.1.50 లక్షలతో స్టీలు బారికేడ్లు ఏర్పాటు చేశారు. రూ.1.50 లక్షల వ్యయంతో ఆలయం ముఖ మండపంలో పలు పురాణ ఘట్టాలను స్మరింపచేసే రంగుల చిత్రాలు ఏర్పాటు చేశారు. రూ.3 లక్షలతో అర్ధ మండపం, రూ.3 లక్షలతో తలుపులు పెట్టించారు. అంతేకాకుండా ఓ అజ్ఞాత భక్తుడు ఇచ్చిన రూ.8 లక్షలతో ఆలయ ముఖ మంటపంలో గ్రానైటు రాళ్లతో నిర్మాణం చేశారు.

పట్టు విడవని పాలకవర్గం

అమలాపురం వేంకటేశ్వరస్వామి ఆలయానికి ఇప్పటివరకూ 12 దఫాలు ధర్మకర్తల మండళ్లు పనిచేశాయి. అయితే 21 నెలల క్రితం అప్పటి మంత్రి పినిపే విశ్వరూప్ సూచనలతో నియమితమైన 12వ ధర్మకర్తల మండలి ఆలయ అభివృద్ధికి స్పష్టమైన ప్రణాళికతో ముందుకు సాగింది. ప్రధానంగా ఆలయ చైర్‌పర్సన్ దూడల విరీతాదేవి, ఈవో దూనబోయిన సాయిబాబు, పాలకవర్గం పట్టు విడవకుండా ప్రయత్నించడంతో ఆలయ అభివృద్ధి సాకారమైంది. దాతలను అన్వేషించి విరాళాలను తీసుకొచ్చి అభివృద్ధిని పట్టాలెక్కించడంలో ధర్మకర్తల మండలి విజయవంతమైంది. ఆలయంలో రూ.4.50 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు మాత్రమే ప్రభుత్వ గ్రాంటుతో జరిగింది. మిగతా అభివృద్ధి అంతా దాతల సహకారంతోనే సాకారమైంది. ఆలయ చైర్‌పర్సన్ విరీతాదేవి దంపతులు సైతం తమ సొంత నిధులిచ్చి ఆలయాభివృద్ధిలో పాలుపంచుకున్నారు. ఆలయ అభివృద్ధిని పట్టణంలో పార్టీలు, కులాలకు అతీతంగా అందరూ అభినందించడమే పాలకవర్గం సాధించిన ప్రగతికి తార్కాణం.

దాతల సహకారంతోనే సాధ్యం



మా ధర్మకర్తల మండలి ఆలయాన్ని పర్యవేక్షించిన కేవలం 21 నెలల్లోనే ఇంతటి అభివృద్ధిని సాధించడానికి ప్రధాన కారణం దాతల సహకారమే. దీనికి తోడు మా పదవీ కాలంలో రాష్ట్ర మంత్రిగా పినిపే విశ్వరూప్ అందించిన సహకారంతో భక్తుల చిరకాల వాంఛను నెరవేర్చాం. వారి ప్రశంసలే దీవెనలుగా భావిస్తున్నాం. ఇప్పుడు కొత్త ప్రభుత్వం వచ్చిన క్రమంలో మా ధర్మకర్తల మండలి సభ్యులమంతా విధుల నుంచి తప్పుకుంటున్నాం.

– దూడల వెంకట విరీతాదేవి, ఆలయ చైర్‌పర్సన్, వెంకటేశ్వరస్వామి ఆలయం, అమలాపురం

ఆంజనేయుడికి ప్రత్యేక పూజలు


ఉప్పలగుప్తంలో అభయాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న పురోహితులు, భక్తులు


వాడపర్రులో ప్రత్యేక అలంకరణలో మందాలమ్మ అమ్మవారు

ఉప్పలగుప్తం: మండలంలోని స్థానిక గ్రామంలో వేంచేసి ఉన్న అభయ ఆంజనేయస్వామి ఆలయ 9వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండితులు భైరవభట్ల సత్యనారాయణమూర్తి, సుబ్రహ్మణ్యేశ్వర శర్మల ఆధ్వర్యంలో పురోహితులు శైవాగమనం ప్రకారం గణపతి పూజ, పుణ్యావచనం, పంచగవ్యం, నవగ్రహ మండపారాధన, వాస్తు పూజ, ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష సింధూర పూజ నిర్వహించారు. అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. అభయాంజనేయ ట్రస్ట్ ఆధ్వర్యంలో మధ్యాహ్నం అన్న సమారాధన నిర్వహించారు. గొల్లవిల్లి పంచాయతీ పరిధి వాడపర్రు గ్రామ దేవత మందా లమ్మ అమ్మవారి ఆలయ 9వ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి మహిళలు అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలు నిర్వహించి, అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

బాధితురాలికి రూ.65,000 ఆర్థిక వితరణ


బాధితురాలికి ఆర్థిక సాయం చేస్తున్న మస్కట్ బీసీ సేవా సమితి సభ్యులు

అల్లవరం: మండలంలోని బెండమూర్లంక గ్రామంలో ఇటీవల కరెంట్ షాక్‌కు గురై తీవ్ర గాయాలపాలైన బాధితురాలు ముసునూరి వరలక్ష్మికి మహాత్మా జ్యోతీరావు పూలే మస్కట్ బీసీ సేవా సమితి సభ్యులు రూ.65,000 ఆర్థిక సాయం చేశారు. ఆదివారం సేవా సమితి అధ్యక్షుడు చప్పిడి వరప్రసాద్ చేతుల మీదుగా బాధిత కుటుంబానికి నగదును అందజేశారు. కోనసీమ జిల్లాలోని వివిధ మండలాలకు చెందినవారు మస్కట్‌లో జీవనోపాధి పొందుతున్నారని, వారంతా బీసీ సేవా సమితి ద్వారా అందించిన సహకారంతో బాధితురాలు వరలక్ష్మికి సాయం అందించామని వరప్రసాద్ తెలిపారు. వరలక్ష్మికి ఆర్థిక సాయం చేసిన బీసీ సేవా సమితి సభ్యులను గ్రామస్తులు అభినందించారు.

గాయత్రీ మాతకు మామిడి పండ్లతో అభిషేకం


మామిడి పండ్ల అభిషేకాన్ని అందుకున్న గాయత్రీ మాత


గాయత్రీ మాత మందిరంలో మామిడి పండ్ల అభిషేకాన్ని వీక్షిస్తున్న భక్తులు

అమలాపురం టౌన్‌: గాయత్రీ మాత పుట్టిన రోజు సందర్భంగా స్థానిక ఎర్ర వంతెన వద్ద గల వేద మాత దివ్యభవ్య గాయత్రీ మందిరంలో అమ్మవారికి 1,108 మామిడి పండ్లతో అభిషేకం, ప్రత్యేక పూజలు ఆదివారం నిర్వహించారు. గాయత్రీ మందిర కమిటీ చైర్మన్ ఆకుల బాబి ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజోత్సవంలో ఆకుల శ్రీదేవి మామిడిపండ్ల అభిషేక క్రతువును అత్యంత భక్తి శ్రద్ధలతో చేపట్టారు. వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని తరించారు. మామిడిపండ్ల అభిషేకం అనంతరం భక్తులకు అమ్మ ప్రసాదంగా ఆ పండ్లను అందజేశారు. సాయంత్రం నుంచి ఆలయ ప్రాంగణంలో సహస్ర దీపాలంకరణ, నృత్య ప్రదర్శనలు జరిగాయి. మందిర కమిటీ కార్యదర్శి కోకా రాంబాబు, కమిటీ ప్రతినిధులు నంద్యాల శ్రీను, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. పలువురు నేతలు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలి


పంచాయతీరాజ్ పనులపై సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు

అమలాపురం రూరల్‌: అమలాపురం అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని, సీఎస్ఆర్ నిధులు పూర్తి స్థాయిలో వినియోగించాలని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. ఆదివారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో పంచాయతీ రాజ్ పనులపై ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమలాపురం పట్టణంపై ఒత్తిడి తగ్గించేలా బైపాస్ బ్రిడ్జిలు, రోడ్ల నిర్మాణానికి ప్రణాళిక తయారుచేయాలన్నారు. ప్రారంభం కాని పనులను వెంటనే టెండర్ పిలిచి మొదలు పెట్టాలని ఆదేశించారు. పనులు ఎప్పుడు మంజూరైనా పర్లేదని, అభివృద్ధి మాత్రం కుంటుపడకూడదన్నారు. రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లి మౌలిక వసతులు కల్పిస్తానన్నారు. సమావేశానికి పీఆర్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ చంటిబాబు, ప్రాజెక్ట్ డీఈఈ అన్యం రాంబాబు, పీఆర్ డీఈఈ రాజ్‌కుమార్, ఏఈలు రాధాకృష్ణ, సత్యనారాయణ, సంపన్న, గంగాధర్‌లు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపు నిర్ణయం ఉపసంహరించుకోవాలి

యానాం: నియోజకవర్గ పరిధిలో విద్యుత్ చార్జీల పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సీఎం రంగసామికి ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల విద్యుత్ చార్జీలను పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. చార్జీలు పెంచితే ప్రధానంగా పేద, మధ్య తరగతి ప్రజలు ఇబ్బందులు పడతారన్నారు. యానాంలో ఓ ప్రైవేట్ ఫ్యాక్టరీ గతంలో కోట్లాది రూపాయల మేర విద్యుత్ చౌర్యానికి పాల్పడిందని, దానికి సంబంధించి సర్‌చార్జి ప్రతి నెలా వినియోగదారుల మీద పడుతుందని ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారన్నారు. దీనిపై పుదుచ్చేరి విద్యుత్ శాఖ స్పష్టతనివ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజావ్యతిరేక చర్యలకు పాల్పడితే ప్రజల పక్షాన పోరాడేందుకు ఆమరణ నిరాహారదీక్షకు సైతం తాను వెనుకాడనని స్పష్టంచేశారు. కార్యక్రమంలో నాయకులు పండు సిద్దార్థ, నక్కల సుబ్బన్న, కాకి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

టౌన్ బ్యాంక్ లాభం రూ.1.19 కోట్లు


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న బ్యాంక్ చైర్మన్ డాక్టర్ వెంకట సూర్యనారాయణ

అమలాపురం టౌన్‌: అమలాపురం కో ఆపరేటివ్ టౌన్ బ్యాంక్ గత మార్చి నెలతో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో రూ.90 కోట్ల మేర వ్యాపారం చేసి రూ.1.19 కోట్ల మేర లాభాన్ని ఆర్జించిందని బ్యాంక్ చైర్మన్ డాక్టర్ మెట్ల వెంకట సూర్యనారాయణ పేర్కొన్నారు. బ్యాంక్ 26వ వార్షిక మహాసభ సందర్భంగా స్థానిక కాపు కల్యాణ మండపంలో ఆదివారం జరిగిన ఖాతాదారుల సమావేశానికి బ్యాంక్ చైర్మన్ డాక్టర్ వెంకట సూర్యనారాయణ అధ్యక్షత వహించి ప్రసంగించారు. బ్యాంక్‌లో రూ.50 కోట్ల మేర డిపాజిట్లు ఉన్నాయని, వివిధ రంగాలకు రూ.39 కోట్ల మేర రుణాలుగా అందజేశామన్నారు. ఖాతాదారుల సహకారంతో బ్యాంక్ ప్రగతి పథంలో నడుస్తోందని పేర్కొన్నారు. ఈ సంవత్సరం ఖాతాదారులకు 13 శాతం డివిడెండ్‌ను ప్రకటిస్తున్నట్లు డాక్టర్ వెంకట సూర్యనారాయణ తెలిపారు. 2023–24 బ్యాంక్ ఆడిట్ నివేదికను, 2024–25, 2025–26 అంచనా బడ్జెట్‌లను బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ శిరగం వేణుగోపాలరావు ప్రవేశపెట్టగా మహాజన సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ సంవత్సరం పదో తరగతిలో అమలాపురం రెవెన్యూ డివిజన్ స్థాయిలో అత్యుత్తమ మార్కులు సాధించిన తొమ్మిది మంది విద్యార్థులకు బ్యాంక్ చైర్మన్ డాక్టర్ వెంకట సూర్యనారాయణ నగదు బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. మహాజన సభలో బ్యాంక్ వైస్ చైర్మన్ ఎండీ అమీర్, డైరెక్టర్లు ఎంకే నాయుడు, డాక్టర్ గోదశి రంగరాజు, డాక్టర్ ఆకెళ్ల వెంకట్రావు, డాక్టర్ గొలకోటి రంగారావు, అల్లాడ శ్రీనివాసు, చింతా శంకరమూర్తి, పి.జాన్‌పాల్, నూలు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు విత్తన బంతులు


విత్తన బంతుల తయారీ శిక్షణకు హాజరైన విద్యార్థులు


అమలాపురం టౌన్‌: పర్యావరణ పరిరక్షణకు విత్తన బంతుల తయారీ అత్యవసరమని ఆజాద్ ఫౌండేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు. స్థానిక ఎర్ర వంతెన వద్ద గల చంద్రశేఖర్ ఆజాద్ పార్కులో విత్తన బంతుల తయారీపై ఫౌండేషన్ ప్రతినిధులు పలువురు ఔత్సాహికులకు ఆదివారం అవగాహన కల్పించారు. విద్యార్థులతో విత్తన బంతులు తయారు చేయించి వాటిని విత్తే విధానాలపై శిక్షణ ఇచ్చారు. ప్రస్తుతం వాతావరణంలో పెను మార్పులు సంభవించి గ్లోబల్ వార్మింగ్ వల్ల ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయని సామాజికవేత్త అడ్డాల గోపాలకృష్ణ అన్నారు. ప్రతి ఇంట్లోనూ పండ్లు తిన్న తర్వాత వాటిలోని గింజలు బయట పడేయకుండా వాటిని సేకరించి భద్రపరిచి విత్తన బంతులుగా తయారుచేసుకోవాలని ఆజాద్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు యల్లమిల్లి నాగ సుధా కొండ అన్నారు. చింత, పనస, లిచీ, నేరేడు, సపోటా, లక్ష్మణ ఫలం, సీతాఫలం తదితర పండ్ల విత్తనాలను విద్యార్థులు విత్తన బంతులుగా తయారుచేశారు. అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలు, విద్యార్థులకు ఫౌండేషన్ ప్రతినిధులు కూరగాయల విత్తనాలను పంపిణీ చేశారు.

వీఆర్వో రాకతో యానాంకు పరార్


పిల్లంక ర్యాంపు సమీపంలో నిల్వ చేసిన ఇసుక

తాళ్లరేవు: మండల పరిధిలోని గోవలంక, పిల్లంక ఇసుక ర్యాంపుల్లో సాగుతున్న ఇసుక అక్రమ రవాణాపై శనివారం రాత్రి స్థానికులు రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. స్థానిక వీఆర్వో సుబ్రహ్మణ్యం అక్కడకు వెళ్లి ఇసుక లారీని అడ్డుకున్నారు. దీంతో ఇసుక అక్రమ రవాణాదారులు లారీని యానాం వైపు తరలించడంతో చేసేది లేక వీఆర్వో వెనుదిరగాల్సి వచ్చింది. అంతేకాదు పిల్లంక ర్యాంపు సమీపంలో నిల్వ చేసిన ఇసుకను అధికారులు సీజ్ చేస్తారని తెలుసుకున్న అక్రమార్కులు ఆదివారం తెల్లవారుజామున ఆ ఇసుకను గోదావరిలోకి మళ్లించినట్లు తెలుస్తుంది. ఇకనైనా అధికార యంత్రాంగం దృష్టిసారించి అక్రమార్కుల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై తాళ్లరేవు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సాయితేజను వివరణ కోరగా పిల్లంక వద్ద ఇసుక నిల్వ చేసిన స్థల యజమానుల నుంచి వివరణ కోరామన్నారు. ఇసుక అక్రమ రవాణా చేస్తున్న వారిపై కేసులు నమోదు చేయనున్నట్లు తెలిపారు.

విశ్రాంతి భవనం ఆక్రమణపై అధికారుల చర్యలు


షట్టర్‌ను తొలగిస్తున్న మున్సిపల్ అధికారులు

సాక్షి కథనానికి స్పందన

యానాం: నియోజకవర్గ శివారు తీరప్రాంత గ్రామమైన సావిత్రినగర్‌లో మున్సిపాలిటీకి చెందిన ప్రయాణికుల విశ్రాంతి భవనాన్ని ఆక్రమించుకుని రూ.2.50 లక్షలకు మరో వ్యక్తికి విక్రయించిన ఘటనపై సాక్షిలో వచ్చిన కథనానికి ఆదివారం మున్సిపాలిటీ ఇన్‌చార్జి కమిషనర్ ఖండవల్లి రామకృష్ణ స్పందించారు. ఈ సందర్భంగా ఆయన పోలీసులు, మున్సిపల్ సిబ్బంది సమక్షంలో విశ్రాంతి భవనానికి మధ్యలో నిర్మించిన గోడను, షట్టర్‌ను తొలగించారు. మున్సిపాలిటీకి చెందిన ఆస్తిని ఆక్రమించుకుని ఏ విధమైన నిర్మాణాలు చేసినా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించి నోటీసు అంటించారు. దానికి చేర్చి ఉన్న మరో షాపుకు సైతం తాళాలు వేసి నోటీసు అంటించారు. షాపు నిర్మాణం చేసిన వ్యక్తికి సైతం నోటీసును అందించారు.

గ్యాస్ విస్ఫోటాలతో కోనసీమ ఎడారిగా మారుతోంది


చింతలపల్లిలో గ్యాస్ లీకైన బోరుబావిని పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు

రాజోలు: ఓఎన్జీసీ, గెయిల్ సంస్థల కార్యకలాపాలతో పాటు తరచూ జరుగుతున్న గ్యాస్ విస్ఫోటాలతో కోనసీమ సహారా ఎడారిగా మారే ప్రమాదం ఉందని ఎమ్మెల్సీ కుడిపూడి సూర్యనారాయణరావు ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం చింతలపల్లిలో బోరు బావి నుంచి గ్యాస్ లీకైన ప్రాంతాన్ని ఆయన సందర్శించారు. కోనసీమ ప్రాంతాల్లో బోరు వేసుకోవాలంటే ప్రజలు భయపడుతున్నారన్నారు. ఓఎన్జీసీ, గెయిల్ సంస్థలు భూమిలో వేసిన కాలం చెల్లిన పైపులైన్లను మార్చాలన్నారు. గ్యాస్ లీకేజీల కారణంగా పచ్చని పంట పొలాలు బీడు భూములుగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో న్యాయవాది కుడిపూడి త్రినాథ్, కరుణాకర్, చెల్లుబోయిన వెంకటరమణ, కట్టా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

భగభగల 'సన్'డే


గొల్లవిల్లిలో నిర్మానుష్యంగా మారిన సరిపల్లి-మునిపల్లి ప్రధాన రహదారి

ఉప్పలగుప్తం: మే నెలలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటం సహజం. అయితే ఇప్పటికే జూన్ నెలలో సగం రోజులు గడుస్తున్నా వర్షాలు కురవకుండా భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. ఆదివారం మండలంలో పలు చోట్ల ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటడంతో ప్రజలు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొన్నారు. ప్రధానంగా ఉక్కబోతకు తట్టుకోలేక ప్రజలు ఇళ్లకే పరిమితమై ఫ్యాన్లు, ఏసీలను ఆశ్రయించారు. వ్యాపార సంస్థలన్నీ జన తాకిడి లేక వెలవెలబోయాయి. ప్రధాన రహదారులన్నీ జన సంచారం లేక నిర్మానుష్యంగా మారాయి.

క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

కాట్రేనికోన: మండలంలోని కాట్రేనికోన సబ్ స్టేషన్ పరిధిలోని పల్లంకర్రు ఫీడర్‌లోని లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల కత్తిరింపు పనుల నిమిత్తం సోమవారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని అమలాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.రవి కుమార్ తెలిపారు. సోమవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ కాట్రేనికోన టౌన్, నడవపల్లి, గెద్దనపల్లి, దొంతికుర్రు, కందికుప్ప, పల్లంకుర్రు, కొప్పిగుంట, పల్లం, బలుసుతిప్ప, కొత్తపాలెం, మొల్లేటిమొగ, పోర గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు.

ఆలయంలో చోరీ

ముమ్మిడివరం: మండలంలోని కొత్తలంక గ్రామంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో శనివారం రాత్రి దొంగలు పడి స్వామివారి డిబ్బీలోని నగదును దొంగిలించారు. ప్రధాన గేటుకు ఉన్న తాళం బద్దలు కొట్టి ఆలయంలో ఉన్న డిబ్బీ ఎత్తుకుపోయి అందులో ఉన్న రూ.40 వేల నగదు అపహరించుకుపోయినట్లు ఆలయ కమిటీ సభ్యులు ముమ్మిడివరం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

90 మద్యం బాటిళ్ల పట్టివేత

కాట్రేనికోన: జిల్లా ఎస్పీ ఎస్.శ్రీధర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అదనపు ఎస్పీ ఎస్.ఖాదర్ బాషాల ఆదేశాలతో ఆదివారం కాట్రేనికోనలో పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఒక వ్యక్తి నుంచి రూ.6,300 విలువ చేసే 90 నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా మద్యం కలిగి ఉన్న వ్యక్తిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశామని జిల్లా ఎస్పీ కార్యాలయం నుంచి ప్రతికా ప్రకటన విడుదల చేశారు.

నాన్ నీట్ ర్యాంకుల జాబితా విడుదల

యానాం: నాన్‌నీట్ కోర్సులకు సంబంధించి ర్యాంకుల జాబితాను సెంటాక్ సంస్థ ఆదివారం విడుదల చేసింది. 2024–25 విద్యా సంవత్సరానికి గాను ఆర్ట్స్, సైన్స్ అండ్ అగ్రికల్చర్, లా తదితర నాన్‌నీట్ కోర్సులకు పుదుచ్చేరి సెంటాక్ అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానించగా ఆన్‌లైన్ ద్వారా 14 వేల దరఖాస్తులొచ్చాయన్నారు. ఈ నేపథ్యంలో అభ్యర్థుల ర్యాంకుల జాబితాను సెంటాక్ వెబ్‌సైట్‌లో పెట్టామన్నారు. వెరిఫికేషన్ చేసిన దరఖాస్తులు డాష్‌బోర్డులో అందుబాటులో ఉన్నాయన్నారు. ఏవైనా అభ్యంతరాలుంటే ఈ నెల 19వ తేదీ లోగా తెలియజేయాలని కోరారు.

ఘనంగా అంబేడ్కర్ జయంతి

తాళ్లరేవు: భారత రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేడ్కర్ జయంతిని ఆదివారం గోవలంక గ్రామంలో ఘనంగా నిర్వహించారు. నరసింహమూర్తి మాస్టారు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఎంపీపీ రాయుడు సునీత ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. యువత అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ కోరుకొండ సింహాద్రమ్మ, వైద్యురాలు భానుమతి, నాయకులు కాశీ రామారావు, యడ్ల కుటుంబరావు, పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

స్వేచ్ఛ కోసం సుదీర్ఘ పోరాటమే శిరోముండనం కేసు

అమలాపురం రూరల్‌: రాజకీయ, సామాజిక స్వేచ్ఛ కోసం జరిగిన సుదీర్ఘ పోరాటమే వెంకటాయపాలెం శిరోముండనం కేసు అని దామోదరం సంజీవయ్య నేషనల్ లా స్కూల్ ప్రొఫెసర్ కె.సుధ అన్నారు. శిరోముండనం తీర్పు నేరానికి తగిన శిక్షేనా అనే అంశంపై అమలాపురం మండలం ఈదరపల్లి అంబేడ్కర్ సామాజిక భవనంలో జరిగిన సదస్సులో ఆమె మాట్లాడారు. నిరంతర ప్రజా పోరాటాలు మాత్రమే న్యాయ, శాసన వ్యవస్థల్ని సక్రమంగా వ్యవహరించేలా చేయగలుగుతాయని తెలిపారు. సదస్సులో ప్రముఖ కవి నామాడి శ్రీధర్, మానవ హక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏడిద రాజేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎ.రవి, జీరోహిత్, జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ ఇక్బాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పి.గన్నవరం: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి అమలాపురం కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి శనివారం రాత్రి మృతి చెందాడు. పి.గన్నవరం ఎస్ఐ బి.శివకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 6న బెల్లంపూడి వద్ద ఎదురెదురుగా మోటారు సైకిళ్లు ఢీకొన్న ఘటనలో బోడపాటి వారిపాలెంనకు చెందిన బోడపాటి మూల బాలాజీ (33) తలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో అతడిని అమలాపురం కిమ్స్ ఆస్పత్రిలో చేర్చగా అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. బాలాజీ మృతదేహానికి అమలాపురం ఏరియా ఆస్పత్రిలో ఆదివారం పోస్టుమార్టం నిర్వహించారు. ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.10,116 విరాళం

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వర స్వామివారి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి రాజమహేంద్రవరానికి చెందిన చిలుకుల కోమలా ఫణి ఆదివారం రూ.10,116 విరాళంగా ఇచ్చారు. ఈ సొమ్మును ఆలయ అర్చకులు వినాయకరావుకు అందజేశారు. దాతను వేదమంత్రాలతో సత్కరించి స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.